



# కలిసిరాని అదృష్టం

రచన:
నరిశేపల్లి లక్ష్మినారాయణ

"కావలెను! వీరనారి ప్రొడక్షన్సువారి తొలి సాంఘికచిత్రం "రౌడీ తంగన్న"లో నటించటానికి సరిక్రొత్త నటులు కావలెను. చక్కటి పర్సనాలిటీ, నాటకరంగానుభవం ఉన్నవారికి గొప్ప అవకాశం ఇవ్వబడుతుంది. మనియార్డరు ద్వారా రెండు రూపాయలు, కార్డు సైజులో బస్టువరకు తీయించిన రెండు ఫొటోలు. ప్రొడక్షన్ మేనేజర్, వీరనారి ప్రొడక్షన్స్, మద్రాసుకు వెంటనే పంపండి. ఎన్నుకొనబడ్డ అభ్యర్థులు ఇంటర్వ్యూకు, తదనంతరం, మేకప్ టెస్టుకు తమ స్వంత ఖర్చుల మీద హాజరు కావలెను" అనే ప్రకటన చూడగానే వీరయ్యా హృదయకడలిలో ఆనందకెరటాలు ఉవ్వెత్తున లేచాయి. సాధ్యమైనవరకు తుడుపులు, దిద్దులు లేకుండా వీరయ్యా వెంటనే ఒక దరఖాస్తుఫారము తయారు చేశాడు. ఇటీవల తీయించిన రెండుఫొటోలు, దరఖాస్తుఫారం, ప్రొడక్షన్ మేనేజరుకు రిజిస్టర్ చేశాడు. రైల్వే ఉద్యోగానికి దరఖాస్తు ఫారాలు కావాలని నాన్నగారితో రెండు రూపాయలు తీసుకొని ప్రొడక్షన్ మేనేజర్కు మనియార్డర్ చేశాడు.

వీరయ్యది చక్కటి విగ్రహం. బసవపురంలోగాక చుట్టూ పల్లెలలోకూడ వీరయ్యా మంచి నాటకాలరాయుడుగా పేరొందాడు. మెట్రిక్ పాసయ్యాడు కాని చూచేవారికి చదువుతున్నట్టు అగుపించదు. ఎందుకంటే అతని మీసాలు అల్లాగుంటాయి. నడకలో నాజూకుతనం అగుపించదు. కాస్త యాసగా మాట్లాడటం అలవాటైంది. దీనికి చాలవరకు చుట్టు పల్లెలలో ఆడే నాటకాలలో అతను నిర్వహించే పాత్రలే కారణం. విడుదలయ్యే ప్రతి పిక్చరును 'మిస్' కాకుండా చూడటం, ఆ పాటలు పదేపదే పాడుకోటం, బాగా అలవాటుపడ్డాయి. కాని ఓర్వలేని మిత్రులు దీన్ని ముద్దుగా "సినిమా పిచ్చి" అనేవారు. ఎన్నాళ్లనుండో సినిమాల్లో చేరి నటనాశిఖరాగ్రాన్ని అందుకోవాలనే కోరిక ఒకటి వీరయ్యాకు ఉండేది. అతని హృదయసీమలో మధుర మధుర భావాలు చెలరేగాయి. తియ్యతియ్యటి కోర్కెలు రేకెత్తాయి.

ఒకరోజు వీరయ్యా బజారుకెళ్లి కూరగాయలు కొంటున్నాడు. ఎవరో వీపుమీద ఒకదెబ్బ చరిచారు. వీరయ్యా ఠకీమని వెనుదిరిగి చూశాడు: "ఒరే శేషయ్యా ఇదేమి బాగులేదురా! నన్ను మొరటువెధవ, మొరటు వెధవ అంటూ మీరు మొరటువెధవలుగా తయారవుతున్నారు. కాకపోతే ఎంత తమాషా కోసం తట్టినా ఈదెబ్బ కొట్టినట్టుంది" అని అన్నాడు వీరయ్యా.

"ఏంరోయ్! ఇటీవల కనబడటమే మానేశావ్! ఏమైనా ఎంగేజ్‌మెంట్ ఉన్నాయా!" అడిగాడు శేషయ్యా. వీరయ్యా మిత్రులలో కెల్లా శేషయ్యా ఒక్కడే సహృదయుడు. వీరయ్యా శ్రేయోభిలాషి. హితైషుడు.

వీరయ్యా వీరనారి ప్రొడక్షన్సుకు దరఖాస్తు పెట్టుకొన్న ఉదంతం అంతా చెప్పాడు శేషయ్యాకు. శేషయ్యా సంతోషించాడు. వీరయ్యా ఆశలు చిగురించి పుష్పఫల సంభరితం కావాలని హృదయపూర్వకంగా కోరుకున్నాడు.

మరునటిరోజు వీరనారి ప్రొడక్షన్సునుండి "అక్నాలెడ్జిమెంటు ఫారమ్" వచ్చింది వీరయ్యాకు. వెంటనే శేషయ్యా ఇంటికెళ్లి "ఒరే శేషూ వచ్చేసిందిరా మనకు" అని కేకేశాడు. "ఆ సినిమాచాన్సు వచ్చిందీ" అంటూ భోజనం చేస్తున్న శేషయ్యా అమాంతంగా లేచివచ్చాడు. "అదికాదురా అప్లికేషన్‌చేరినట్టు Acknowledgement form వచ్చింది" అని అన్నాడు. "ఓరి వెధవా అందులో ఏముందిరా నీ బొంద, అందుకే నిన్ను మొరటువాడనేది. సినిమాచాన్సు రావాలిగాని, అది వస్తే ఏం లాభం" అని శేషయ్యా పుంచలించాడు. చేసేదిలేక వీరయ్యా గృహోన్ముఖుడయ్యాడు. వారంరోజులు గడిచాయి, పక్షం రోజులు గడచాయి, మాసంరోజులు దాటాయి. ఉత్తరాలేమీ రాలేదు. వీరయ్యా హృదయక్షేత్రంలో ఆశామొలకలు మొగ్గలు తొడగడం మాని వాడిపోజొచ్చాయి.

ఆరోజు భోజనం ముగించి, సినిమాపత్రిక నొకటి చదువుతూ వసారాలో కూచున్నాడు వీరయ్యా. "పోస్ట్" అంటూ ఒక కవరు తీసుకొచ్చి ఇచ్చాడు పోస్టుమాన్. కవరుమీద వీరనారి ప్రొడక్షన్స్, మద్రాసు, అనే అక్షరాలు చూడగానే వీరయ్యా ఎగిరి గంతేద్దామనుకున్నాడు కాని ఎవరైనాచూస్తే మొరటువాడంటారని ఆ ఊహను ఉపసంహరించుకున్నాడు.

అతిశయించిన ఆనందోత్సాహాలతో మెల్లిగా కవరుచించి అందులోని కాగితం తీసి చదివాడు. ఇంటర్వ్యూకు గురువారంనాడు హాజరుకావాలని ఉంది. ఎన్నుకోబడ్డ అభ్యర్థులకు మేకప్ టెస్టుకూడ అప్పుడే జరుపబడుతుందని అందులో ఉంది. కాని ఆరోజు మంగళవారం. తప్పనిసరిగా ఆరోజే బయలుదేరాలి. మంగళవారం ప్రయాణానికి మంచిది కాదని ఇంటిల్లిపాదీ తమ విశాలాభిప్రాయాన్ని ప్రకటించారు. కాని ఎవరిమాటలనూ లక్ష్యపెట్టకుండా మిత్రుడు శేషయ్యా ఆర్థిక సహాయంతో ఆరాత్రే మద్రాస్ మెయిల్ ఎక్కాడు. మద్రాసునగర తొలిసందర్శనం వీరయ్యాకు సరిక్రొత్త అనుభవం. ఆరోజు నానా తంటాలు పడి వీరనారి ప్రొడక్షన్స్ ఆఫీసును దాదాపు పదిగంటలకల్లా చేరుకున్నాడు. అప్పటికే అక్కడ కొద్దిమంది హాజరయ్యారు. కొందరు బుష్‌కోట్ల వాళ్ళు, కొందరు ఫ్రెంచికట్‌మీసాల వాళ్ళు, కొందరు జులుపాలవాళ్లు, కొందరు నాలుగుకళ్ళ వాళ్ళు, అక్కడివ్యక్తులు రకరకాల విగ్రహాల్లా అగుపించారు వీరయ్యాకు. మేనేజర్ ఒకొక్కక్కరినీ పిలిచి, పరీక్షించి బయటికి పంపుతున్నాడు. పోజులుకొడుతూ లోనికెళుతూ, బయటికి వచ్చేటప్పుడు ఆముదం త్రాగినట్టుండే ముఖాలతో వస్తున్నారు. వీరయ్యా చాన్సు వచ్చింది. లోనికెళ్ళి 'నమస్కారమండీ' అన్నాడు మేనేజర్‌ను చూచి. వీరయ్యాను చూడగానే మేనేజర్‌కు కాస్త ఒణుకుపుట్టినట్టనిపించింది. వీరయ్యాను 'కూర్చోండి' అన్నాడు మేనేజర్. 'సంతోషమండీ' అంటూ కుర్చీలో ఎదురుగ్గా కూచున్నాడు.

'తమకు నాటకానుభవ మేమైనా ఉందా?' ప్రశ్నించారు మేనేజర్‌గారు.

"అపారంగా ఉందండీ."

"ఏఏపాత్రలు నిర్వహించారు ?"

"హరిశ్చంద్రుడు, నలుడు."

"ఆపండి! మేము తీసేది పౌరాణికం కాదండీ! సాంఘికరాజం. పేరు "రౌడీ రంగన్న" పత్రికల్లో చిత్రం తాలూకు ప్రకటనలు చూచే ఉంటారు.

"చూశానండీ! సాంఘికాల్లో వేషాలు వేశానండీ!"

"ఆ వేశారూ! ఏఏ నాటకాల్లో పాత్రలు నిర్వహించారు ?"

"ఔనండీ! "తొలిజాము"లో నేను వేసిన విటునిపాత్రకు ప్రజావాహిని నాకు జోహర్లు



పట్టిందండీ! "నడిరేయి"లో బందిపోటు దొంగగా నాకు నేనే సాటి అని అనిపించుకున్నానండీ! "కన్నీరు"లో కథానాయకిని బలవంతం చేయటంలోనూ, చివరకు ఎత్తుకుపోవటంలోను మాంచి నేర్పును ప్రదర్శించానని ప్రజావాణి కోడై కూసింది. "మగాడు"లో వీరయ్య నిజంగా మగాడేరా అని ఏక కంఠంతో పలికారండీ!" అని ఆపాడు వీరయ్య.

"ప్రణయఘట్టాల్లో ఎప్పుడైనా నటించారా ?"

"నటించానండీ! నామిత్రుడు శేషయ్య ఆడవేషం వేసేవాడు. అతని ప్రక్కన నేను నాయకపాత్రను ధరించేవాణ్ని."

"ఊ! చూడండీ మీరు ప్రస్తుతానికి ఓ రెండువేలరూపాయలు డిపాజిట్ కట్టాల్సుంటుంది. చిత్రనిర్మాణానంతరం వడ్డీతోనహా తమసొమ్ము తమకు ఇస్తాము. తమరు నటించేందుకు యధోచితంగా ముట్టచెబుతాము. మా "రౌడీ రంగన్న"లో తమకొక రౌడీపాత్ర నిస్తాం. చిత్రంలో విలన్ ఆజ్ఞానుసారంగా ఆ రౌడీ 'బాలు'గాడు ఒక అమ్మాయిని ఎత్తుకుపోతాడు. అమ్మాయి తోబుట్టువులు ఇద్దరు బాలును వెంటాడి చివరకు ఆమెను రక్షిస్తారు. బాలు వంతెనమీదనుండి క్రిందపడి మరణిస్తాడు. మేనేజర్ ఇంకా ఏదో చెప్పబోతూండగనే,

"ఆ! మరణించటమే" అన్నాడు వీరయ్య.

"చిత్రంలోనయ్యా! నీకేం భయం లేదు. ఎన్నడూ సినిమాలు చూడలేదూ? నీ ప్రాణానికి నా ప్రాణాలు అడ్డువేస్తాను. అదంతా ట్రిక్, సరేనా" అన్నాడు మేనేజర్.

"భయం విషయం కాదండీ, ఆమాత్రం నాకూ తెలుసనుకోండి. నేను చచ్చిపోతే నా పాత్రను ప్రేక్షకులుకూడ చచ్చినట్టు మరచిపోతారు. కనుక, నేనాపాత్రను నిర్వహించి ఏం లాభం! పైగా రెండువేలరూపాయలు అంటే" వీరయ్య చెప్పటం ముగియకుండానే మేనేజర్ అందుకొని "విషాదాంత పాత్రలే ప్రేక్షకుల స్మృతిపథంలో ఎల్లప్పుడు ఆకాశంలోని నక్షత్రాల్లా ప్రకాశిస్తుంటాయి. ఇక డబ్బు విషయమంటారా! దానికి మీరు విశ్వప్రయత్నాలు చెయ్యాల్సుంటుంది. మీ ఇంటిపెద్ద లెవరైనా ఉంటే వారితో సంప్రతించండి. డిపాజిట్ కట్టగలిగారా సరే! లేదా ఆ పాత్ర డిపాజిట్ కట్టగలిగే మరోవ్యక్తికి ఇవ్వబడుతుంది. వారంరోజులు గడువుంటుంది. కట్టగలిగితే రెండువేలరూపాయలకు మా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ పేరుతో బ్యాంకులో డ్రాఫ్టు తీసి పంపండి. 'మేకప్ టెస్ట్'కు మిమ్మల్ని మళ్ళీ పిలిపిస్తాము. తదనంతరం షూటింగ్ కార్యక్రమాలకు మిమ్ములను ఆహ్వానించినప్పుడల్లా మీరువచ్చి షూటింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటూండవచ్చు. ఇక మీరు వెళ్ళొచ్చు" అని ఏదో వ్రాయటంలో నిమగ్నుడయ్యాడు మేనేజర్.

వీరయ్య సెలవుపుచ్చుకొని ఆరోజే ప్రయాణమయ్యాడు గ్రామానికి, ఇల్లు చేరగానే జర్గిగినదంతా తల్లిదండ్రులకు, శేషయ్యకు పూసగుచ్చినట్టు చెప్పాడు.

"రెండువేల రూపాయలే! ఎక్కడనుండి తేవటం. ఆ సినిమా వద్దు! ఆ పాడూ వద్దు" అని వీరయ్య తండ్రి తన అభిప్రాయాన్ని బయటికి కక్కేశాడు. రెండురోజులు గడిచాయి. ఇక ఐదురోజులుమాత్రమే గడువుందని వీరయ్య ఎంతో పరితపింపసాగాడు. శేషయ్యను బ్రతిమాలి తన తండ్రికి నచ్చ చెప్పమని అడిగాడు వీరయ్య. మరునటిరోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక వీరయ్యతండ్రిని అడిగాడు, "ఏలాగో ఒకలా ఓ రెండువేలు సర్దమని" ఇంతలోనే శేషయ్యవచ్చి విషయంలో జోక్యం చేసుకొని "అవును చిన్నాయనా! ఈనాడు మనం ఒక రెండువేల రూపాయలు ఎల్లాగో సర్దామంటే రేపు మరొక్క ఛాన్స్ తగిలిందంటే ఇరవైవేలు ఊడిపడుతాయి. మరికొన్నాళ్లకు లక్షలు సంపాదిస్తాడు. కేవలం రెండువేలకోసం దొరికే సినిమా అవకాశాన్ని దూరం చేసుకోటం మంచిదేనా? అంతేకాకుండా రేప్రొద్దున వీరయ్య ఒక గొప్ప నటశేఖరు డయ్యాడంటే, ఆ కీర్తి అంతా నీకే కదా చిన్నాన్నా! ఫలానానటుడు బసవపుత్రం రామదాసు కొడుకంటే ఎంత గౌరవం! ఎంత ప్రతిష్ఠ! అని ఆగాడు శేషయ్య.

"అవుననుకో! ఐనా ఈ గడ్డురోజుల్లో రెండువేలు అంటే...." రామదాసు వాక్యం పూర్తిచేయకముందే.

"కష్టమే! ఐనా ఏలాగో ఒకలా సర్దండి చిన్నాన్నగారు. ఈ కాస్త ముగిసిందంటే, మీ అదృష్టం పండినట్టే." శేషయ్య పలుకులకు

రామదాసు సమాధానమేమీ ఇవ్వలేదు. వీరయ్య మనస్సు పరీక్షాఫలితాలకోసం పేపర్ చూస్తున్న విద్యార్థి మనస్సులాగ ఉంది: "సరే!" అన్నాడు రామదాసు. పరీక్ష ప్యాసైనట్టు ఆనందించాడు వీరయ్య. రామదాసు రెండురోజులకల్లా రెండువేలరూపాయలు అతికష్టంమీద సర్దగలిగాడు. వీరయ్య డబ్బు పంపినరోజు అతని ఆనందానికి హద్దులు లేక పొయ్యాయి.

రోజులు దొర్లిపోతున్నాయి, మూడు మాసాలు గడిచాయి. వీరనారి ప్రొడక్షన్స్ నుండి ఎల్లాంటి సమాధానమూ రాలేదు. వీరయ్యహృదయంలో ఆందోళన అధికం కాజొచ్చింది. ఆర్థిక ఇబ్బందుల్లో అసలే మునిగిన రామదాసు, కొడుకు తెచ్చినసమస్యను పరిష్కరించటానికి తెచ్చిన రెండువేల రూపాయలు గోరుచుట్టుపై రోకటిపోటులాగ పరిణమించాయి. సుపుత్రుని చూచినపుడల్లా రామదాసు 'గునగున'మని ఏవో రెండుమాటలు స్వగతంగా మాట్లాడుకొనేవాడు. తండ్రికి, వీరయ్య తన ముఖం చూపటానికి దుర్భరమనిపించింది. 'ఫుల్‌లోడ్'తో కదిలిన ఎద్దుల బండీ చక్రాల్లాగ రోజులు భారంగా దొర్లిపోతున్నాయి.

ఆరోజు మామూలుగా కూరగాయలు తేవటానికి వీరయ్య బజారుకెళ్లాడు. ఎవరో దినపత్రిక పట్టుకెళుతుంటే, వీరయ్యదృష్టి అప్రయత్నంగా ఆపత్రికలోని సినిమాప్రకటనపై బడింది. "విశాలాంధ్రకు వీరనారి ప్రొడక్షన్స్ వారి తొలిపుష్పం "రౌడీ రంగన్న" ప్రముఖ తారాగణంతో తయారవుతోంది. నిర్మాత, దర్శకుడు: బిందుమూర్తి" అని ఉంది. ఒక న్యూస్‌పేపర్ పట్టుకెళ్లి తండ్రికి ఈ ప్రకటన చూపించి "త్వరలో మనకు ఆహ్వానం రావచ్చు నాన్నా" అని అన్నాడు వీరయ్య.

వీరయ్య ఆరోజునుండి ప్రతిదినం ఒక యుగంలా గడుపుతున్నాడు. 'వీరనారి ప్రొడక్షన్స్‌వారు ఎప్పుడు పిలిపిస్తారా! ఎప్పుడు తన నటనాప్రతిభను ప్రదర్శిస్తానా!' అని అతను ఉవ్విళ్ళూరసాగాడు.

కాని మరునటిరోజే వీరనారి ప్రొడక్షన్స్ నుండి ఉత్తరం వచ్చింది. "తాము చిత్రనిర్మాణానికి ఉపక్రమించామని తాను Make up testకు రావాలని" అందులో ఉంది.

మద్రాసుకు వెళ్లి మూడురోజులుండి వచ్చినందుకు మరో వందరూపాయలు ఖర్చు అయ్యాయి వీరయ్యకు. వీరయ్య రాగానే రామదాసు కుతూహలంతో "ఏమైందిరా" అని అడిగాడు. "O. K." అని అన్నారు నాన్నా! అవసరమొచ్చినపుడు పిలిపిస్తామన్నారు.

"నీపాత్రకు డైలాగ్స్ ఏమైనా ఇచ్చారా?" అడిగాడు రామదాసు,

"ఇచ్చారు నాన్నా! ఒకటే వాక్యం. "అహహ! ఎక్కడికి పోతావే గువ్వా! మా అయ్యగారి చూపుల్లో పడ్డావు, తప్పించుకోలేవే పిట్టా!" అనే వాక్యమే నాన్నా నా డైలాగ్స్. అప్పుడే కంఠతా పట్టేశాను. 'ఛ ఛ' అవేం మాటలు రా అన్నాడు రామదాసు. "రౌడీ పాత్రకు డైలాగ్స్ అల్లాగే ఉంటాయి నాన్నా! అల్లాంటి పలుకులే ప్రేక్షకుల్లో ఉత్తేజాన్ని ఉత్పన్నం చేస్తాయి" అని వివరించాడు వీరయ్య. కొడుకు వీరయ్య సమాధానం తండ్రి రామదాసుకు సంతృప్తిని కలుగచేసింది. కాలచక్రం తిరుగుతోంది. చంద్రోదయంకోసం నిరాకరంవలె, చంద్రకిరణాలకోసం చకోరపక్షివలె, వీరనారి ప్రొడక్షన్స్‌వారి ఆహ్వానానికి వీరయ్య ఎదురుచూడసాగాడు. వీరయ్యను చూచినపుడల్లా మిత్రులంతా "వచ్చేసిందిరా వీరయ్యకు సినిమావేషం" అని ఎత్తిపొడిచేవారు. ఐనా శేషయ్యసలహాలతో వీరయ్య చల్లబడి, తలవంచుకుని తిరిగేవాడు. కాని ఏనాడో ఒకనాడు నటనాగ్రశిఖరాన్ని అందుకోగలననే విశ్వాసంమాత్రం అతని కుండేది.

ఒకనాడు హఠాత్తుగ వీరయ్యకు వీరనారి ప్రొడక్షన్స్‌నుండి లెటర్‌వచ్చింది. 'షూటింగ్‌కు ఐదురోజులలోపల హాజరు కమ్మని' ఇంటిల్లిపాదీ సంతోషసాగరంలో మునిగితేలారు. వీరయ్య హృదయవిహంగం అనంతాకాశంలో రెక్కలువిప్పి ఎగిరింది. ఈవార్త విన్న మిత్రులకళ్ళు ఎఱ్ఱబడ్డాయి. కొందరుమాత్రం శేషయ్యతోబాటు స్టేషన్‌కెళ్లి వీడ్కొలిచ్చారు.

పదిరోజులు గడచాయి. వీరయ్యతో షూటింగ్ కార్యక్రమమంతా ముగిసింది. ఆఫీస్ బాయ్ మొదలుకొని ఎసోసియేట్ డైరక్టర్ వరకు "మీకు ముమ్ముందు చక్కటి భవిష్యత్తు ఉంటుందండీ" అని ముఖాముఖి స్తుతించారు వీరయ్యను. నిర్మాత-దర్శకుడు బిందుమూర్తికూడ "చూడండీ! వీరయ్యగారు మీతో జరగాల్సిన షూటింగ్ కార్యక్రమం సక్రమంగా సాగిపోయింది. రషెస్ చూచినవాళ్ళు తమనటన అద్వితీయంగా ఉందని ప్రశంసించారు. కాని మీపేరు బాగాలేదు. వీరయ్య అనేది తమ కీర్తికౌముదికి అంత శోభ చేకూర్చలేదేమో అని మా శంక. అందుకోసం టైటిల్స్‌లో తమపేరును 'వీరకుమార్'గా మార్చివేస్తాం. తమ నటనకు ఆపేరు 'అభరణానికి వజ్రం'లాగా వుంటుంది. ఏమంటారు? అన్నాడు. ఉప్పొంగినహృదయంతో. "అల్లాగేనండి" అన్నాడు వీరయ్య. గ్రామానికి బయలుదేరేముందు మరొక్కసారి బిందుమూర్తిని కలుసుకొన్నాడు వీరయ్య. "మా ప్రొడక్షన్ నెం. 2 "విషసర్పాలు" లో మీకు మరో దుష్టపాత్ర నిస్తామని హామీ ఇచ్చాడు.

బసవపురం ప్రజలేకాక చుట్టూ పల్లెల్లో ఉన్నవారంతా "అదృష్టమంటే వీరయ్యదే! అమాంతంగా సినీఫీల్డు కెగిరి అమోఘంగా నటించి వచ్చాడు. డైరక్టర్‌కూడ వీరయ్య నటనను ప్రశంసించి అభినందించాడట" అని అనుకోజొచ్చారు. ఎక్కడచూచినా వీరయ్య పేరే! కొడుకు ఘనతను పదిమంది నోటి నుండి విన్న రామదాసు హృదయంలో ఆనంద జ్యోతులు నవ్యకాంతులను విరజిమ్మాయి. వీరయ్య ఎక్కడికెళ్ళినా పొగడ్తలూ, అభినందనలూ! అతని హృదయంలో ఆనందోత్సాహాలు అధికమయ్యాయి. తన్ను వరించిన అదృష్టదేవతను తలచుకొని వీరయ్య తనలో తానే మురిసిపొయ్యాడు.

పత్రికల్లో దీపావళి కానుకగా వీరనారి ప్రొడక్షన్స్‌వారు "రౌడీ రంగన్న"కు పబ్లిసిటీ మహ జోరుగా జరిపించారు. ప్రకటనల్లో సంగీతం: సంగమేశం, నిర్మాత-దర్శకుడు: బిందుమూర్తి. అనిమాత్రము ఉంది. దీపావళి ఇహ పదిరోజు లుంది. ప్రజలంతా వీరయ్య నటనను కని, ఆనందించటానికి ఎంతో కుతూహలాన్ని ప్రదర్శించటం మొదలెట్టారు. దీపావళి వచ్చింది. పిక్చర్ రిలీజైంది. ప్రజలు చాలమంది చిత్రాన్ని చూశారు కాని వీరయ్య చిత్రంలో ఎక్కడ నటించాడో ఎవరూ తెలుసుకోలేక పొయ్యారు. వీరయ్యనటన ప్రేక్షకులకు అర్థం కాలేదు. వీరయ్య ఆనందంతో "అదిగో అదే నాపాత్ర" అని రామదాసుకు, శేషయ్యకు "బాలు"గ తాను నటించిన సన్నివేశాన్ని చూపాడు. అందులో వీరయ్య కళ్ళకు బట్ట కట్టుకొని అర్థరాత్రిసమయంలో ఇంట్లో జొరబడి కథానాయకిని ఎత్తుకుపోతాడు. అర్థరాత్రి సమయం కాబట్టి ఫోటోగ్రఫీ నీడలు అంధకారాన్ని సృష్టించాయి. అంతేకాక వీరయ్య కళ్ళకు బట్టకట్టాడు. అందులోను కథానాయకిని దట్టంగా చెట్లు

పెరిగిన అడవిగుండా ఎత్తుకుపోతాడు. ఇవన్నీ కలసి వీరయ్యను తెరమీద స్పష్టంగా అగుపడకుండా చేశాయి. వీరయ్య సంభాషణలు వల్లించినచోట సౌండ్ ఫెయిలైంది. దీన్ని పురస్కరించుకొని చాలమంది వీరయ్య ఫంక్ కొట్టాడని విమర్శించారు. వీరయ్య పేరు 'టైటిల్స్'లో 'వీరకుమార్' అని ఉంది. దీన్ని ఇట్టి టైటిల్స్‌లో అసలు వీరయ్యపేరే లేదని చాలమంది తమ దృఢఅభిప్రాయాన్ని ప్రకటించారు. తండ్రి రామదాసుకు, మిత్రుడు శేషయ్యకు ఇదే అనుమానం వచ్చింది. దీనికి వీరయ్య ఏమి చెపితేమాత్రం ఏం లాభం. "చిత్రం కథ లేకపోవటంవల్ల దెబ్బ తినిందని" కొందరు, "సంగమేశం సంగీతం శ్రావ్యంగా లేకపోవటం చిత్ర పరాజయానికి దారితీసిందని" కొందరు, "నటీనటులు అతి చచ్చుగా నటించటంవల్ల చిత్రం ఫెయిలైందని" కొందరు, "పాటలు హిట్స్ అయ్యేటివి లేవని, ప్రత్యేకాకర్షణలు చెప్పుకోటానికి ఏమీ లేవని" కొందరు పలురకాల విమర్శించారు. ఏది యేమైనా చిత్రం పూర్తిగ దెబ్బతినింది. మరునటిరోజే దినపత్రికల్లో "వీరనారి ప్రొడక్షన్స్ దివాలా తీసిందని" తాజావార్త ఒకటి వచ్చింది.

ఇదంతా అదృష్టం కలిసిరాకపోవటంవల్ల జరిగిందని వీరయ్య బాధపడ్డాడు. తండ్రి రామదాసుకు ఒక్కటే దిగులు పడిపోయింది. "తాకట్టుపెట్టిన ఒక్కగానొక్క ఇంటిని విడిపించుకోటానికి రెండువేలరూపాయలు ఎక్కడనుండి తేవటమా?" అని.

(కేవలం కల్పితం)

★



భార్గవి ఫిలిమ్సువారి "మృత్యువుని జయించిన మానవుడు"లో అభినేత్రి కృష్ణకుమారి.

# అష్టమినాటి అతిథి ★

రచన : సాధనాల నారాయణస్వామి

చాలీచాలని జీతంతో ముగ్గురు పిల్లలతో కాలక్షేపం చేస్తున్న రోజులవి. వచ్చే తొంభయి రూపాయిలు ఇరవయ్యో తారీఖుతో ఆఖరు. మర్నాటినుంచి పక్కింటి ధర్మారావు దగ్గరో ప్రకాశరావుదగ్గరో అప్పుకు తయారు. ఇట్లా వుంటూ వుండగా.

ఓరోజున సాయంకాలం....అవేళ అష్టమి అనుకుంటాతిథి .... మా అత్తగారి అన్నగారి బావమరది బెడ్డింగూపెట్టె వేసుకొని దిగాడు, కోర్టులో ఏదో వాయిదావుందంటూ....రాకరాక వచ్చాడు కదా అమ్మగారి తరపుచుట్టంఅని మాకనకరత్నం, ఆర్భాటంగా మూడు నాలుగురకాల కూరలు అప్పడాలు దప్పళాలు వగయిరాలు వేసి వడ్డించింది.

"నీముందు నలుడూ భీముడూకూడా తీసికట్టే నమ్మాయీ కనకరత్నం అంటూ లేచి చెయ్యికడిగాడు.

రెండో రోజుకూడా అదేప్రకారం, తేడా లేకుండా నడ్డించింది కనకరత్నం. "బ్రేవ్" మని తేన్చుకుంటూ కోర్టుకుపోయాడాయన. ఇట్లాగే రెండు రోజులు గడిచినాయి. "చెరువుపక్క భూమి బేరానికి వచ్చింది బేరంచేసుకు వెళ్తానమ్మాయ్" అంటూ యింకో వారం రోజులు మా యింట్లోనే ఆతిథ్యం తీసుకున్నాడు, అష్టమినాడు వచ్చిన అతిథి.

అసలే జీతంచాలక, అన్నీ ప్రియమైపోయి తగలబడుతున్న రోజుల్లో యీయన వ్యవహారం మాకేమీ నచ్చలేదు. కోర్టుపని అయిపోయింది. భూమి బేరంకూడా అయిపోయింది కాని మా అతిథిమాత్రం మాయిల్లు కదలలేదు.

ఓ రోజున "యీ వూళ్లో రెండుచింతల సుబ్రహ్మణ్యంగారి అబ్బాయి బియ్యే. ప్యాసయ్యాట్ట, అమ్మాయికి సంబంధం ఏమైనా కుదురుతుందేమో చూడాలమ్మా కనకరత్నం' అన్నాడు. యీమాట వినగానే మా యిద్దరి గుండెల్లో రాళ్లుపడ్డాయి. మాకొంప ఆరిందన్నమాటే, వాళ్ల అమ్మాయికి సంబంధం స్థిరపడ్డం ఎలాగున్నా, మాకొంప గుండమవటం మాత్రం స్థిరం అవుతుంది.

ఈ అష్టమినాటి అతిథిగ్రహాన్ని "ఎలాగ వదలించుకోవాలా అన్నది "ఇండియా చైనా బోర్డరు" సమస్యకంటే పెద్దదయి పోయిందిమాకు, కనకరత్నం వినుక్కుంటున్నా, కసురుకుంటున్నా, పిల్లలమీద కోపంచూపిస్తున్నా కూడా ఆయన లెక్కచేయటం లేదు, దూషణ భూషణములు శరీరానికేగాని ఆత్మకి లేవన్నట్లు, పైగా పిల్లలతో యింతేనమ్మా! విసుక్కోకూడదు. పాపం—పిల్లలకేంతెలుసూ" అంటూ మాకే బుద్ధులుచెప్పటం ప్రారంభించాడు.

ఎన్ని లోట్లుచేసినా సరే, ఆయన లెఖ్ఖ చేయటంలేదు. భోజనం మధ్యాహ్నం రెండు గంటలకి వడ్డించినాసరే మాట్లాడకుండా భోజనంచేయటం మొదలుపెట్టేడు. పిల్లలతో కష్టంగా లేదమ్మా? ఇంటిడు పనితో నలిగి పోతున్నావు. ఓపనిమనిషిని చూస్తానుండు. అంటాడేగాని తిరుగు ప్రయాణం మాట మాత్రం ఎత్తడు. మా ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయినాయి మా అష్టమినాటి అతిథిముందు.

ఓరాత్రంతా ఆలోచించాం దీనికి మందు ఏమిటా అని. మా కనకరత్నం ఒక ఉపాయం చెప్పింది. "వాళ్లావిడ్నిగురించీ, వాళ్ల మ్మాయిని గురించీ జ్ఞాపకంచెయ్యండి. అప్పుడు యింటిమీద దృష్టితిరిగి జెండా యెత్తుతాడు అంది. సరే....యిది బాగానే వుంది అనుకున్నా.

మర్నాడు కాఫీలు తాగేటప్పుడు ఈప్రస్తావనతెచ్చా.

మీరువచ్చి ఓనెల దాటినట్లుంది, యింటిదగ్గర అత్తయ్యగారికి యిబ్బందిగా వుందేమో" అని ఆగాను అర్థం చేసుకుంటాడు కదా అని.

ఏమీ తడుముకోకుండా కుండపగల కొట్టినట్టు జవాబిచ్చాడు మా అష్టమినాటి అతిథి—

అదే ఆలోచిస్తున్నా నబ్బాయి....మీ అత్తయ్య అక్కడ, నేనుయిక్కడ ఏమి బాగాలేదు. రేపే వెళ్లి మీ అత్తయ్యని, అమ్మాయి నిర్మలని తీసుకువచ్చేసి, ముగ్గురం యిక్కడే నాలుగు రోజులపాటుండి, అమ్మాయి పెళ్లిసంబంధం తేల్చిపారేద్దామని అనుకుంటున్నా, ఏమంటావు?" అన్నాడు.

నాచేతిలో కాఫీగ్లాసు జారిపడి 'టపీ'మంది.

★